
# ఇదో వింత

పొత్తూరి విజయలక్ష్మి

నేనూ, భవానీ, యశోద, సీత ఒక గ్రూప్. అందరం ఇల్లాళ్లమే. కలిసిన కాసేపూ వాళ్లమీదా వీళ్లమీదా చెప్పుకోకుండా, జోకులేసుకుని మనసారా నవ్వేసుకుని కాఫీలు తాగి విడిపోతాం. ఫోన్లు చేసుకుని కబుర్లు చెప్పుకుంటాం. గత పదిహేనేళ్లుగా దినదిన ప్రవర్ధమానం అవుతోంది మా స్నేహం.

మధ్యాహ్నం మూడింటికి భవాని దగ్గర్నుంచి ఫోను. ''వెంటనే వస్తే నీకో తమాషా చూపిస్తా'' అంటూ. వెంటనే తయారై ఆటోలో వెళ్లాను వాళ్లింటికి. మా ఇంటికి దూరమే వాళ్లిల్లు.



భవాని కూతురు సుమ డిగ్రీపాసై ఒక ప్రైవేట్ కాన్వెంటులో పనిచేస్తోంది. సాయంత్రం పూట చిన్నపిల్లలకి సంగీతం నేర్పుతూ తను నేర్చుకున్న సంగీతాన్ని సార్థకం చేసుకుంటుంది.

నే వెళ్లేసరికి వాకిట్లోనే ఎదురయింది సుమ. ''ఏమిటి సుమా? నన్నెందుకు రమ్మన్నారు అంటే

''రండి ఆంటీ మీకో విశిష్ట వ్యక్తిని చూపిస్తాను'' అంది.

లోపలికివెళ్లాం. భవాని దగ్గరుంది ఒక పాప. అయిదేళ్లుంటాయి. బొద్దుగా ముద్దుగా వుంది.

''ఇదుగో ఈ పాపగురించే నీకు చెప్పింది'' అంది భవాని.

''నీ పేరేమిటమ్మా'' అని అడిగాను.

''భానవ'' అంది ముద్దుగా. అర్థం కాలేదు. మళ్లీ అడిగాను. చెప్పింది ''భానవ.''

''అంటే, భావన అని అర్థం అన్నమాట'' అంది సుమ.

నాకు మరీ ముద్దు వచ్చింది. ఊరీ ఊరని ముక్క రుచి వచ్చీరాని మాట రుచి అన్నాను.

''అవునవును. ఇంకా విను'' అని ''భావనా ఒకపాట పాడమ్మా'' అంది భవాని.

వరణీవా మృదుణాపీ
వనరుహ చెలినుణారీ
సుచరిర బంఛరణేవీ.

అని పాడసాగింది. నాకు భలే నవ్వొచ్చింది.

''ఈ పాపని వున్నపళంగా టి.వి.కి పంపిస్తే మరో రివర్స్‌గేర్, గజిబిజి గపదని అవుతుంది'' అన్నాను.

''అబ్బే ఇది గిన్నిస్‌బుక్ కేసు'' అంది భవాని.

అంతలోనే ఓ కుర్రాడు వచ్చాడు. ఇద్దరికీ పోలికలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆ పాప అన్నట.

''నీ పేరేమిటి నాన్నా?'' అన్నాను.

''భతర్'' అని చెప్పాడు.

''భరత్ ఇవ్వాళ ఆలస్యం అయిందేం?'' అంది సుమ.

''ఇళ్లావ స్పోర్ట్స్ రీపియడ్ వుంది మిస్. అందుకే లేట్ అయింది'' అన్నాడు.

''పద వాళ్లింటికి వెళ్దాం. అందర్నీ పరిచయం చేస్తాను'' అంది భవాని.

పక్క సందులోనే వాళ్లిల్లు. వాకిట్లోనే ఎదురయ్యాడు పిల్లల తండ్రి భాస్కర్రావు.

మమ్మల్ని చూడగానే మొహం ఇంత చేసుకుని పలకరించాడు.

''భనావి గారా? రండమ్మా రండి. గాబున్నారా? మా భానవ గంసీతం ఎందాకా వచ్చింది'' అన్నాడు.

''బాగానే వుందండీ'' అంది భవాని.

మెల్లిమెల్లిగా ఆ భాష అర్థం అవసాగింది నాకు.

''జాకనీ, జాకనీ'' అని పిల్చాడు. లోపల్నించి భార్యవచ్చింది.

రండి అని ఆహ్వానించింది. ఆవిడ చాలా మితభాషి.

ఇద్దరి బదులూ ఆయనే మాట్లాడుతున్నాడు.

''వీరు భనావి గారి ఫ్రెండు. మా ఇంకిటి రావడం చాలా తంసోషం. ఏదో మామూలు వాళ్లం. దీనా దానా సంసారం'' అని చెప్పుకొచ్చాడు.

''వద్దు వెళ్లిపోతాం అన్నా వినకుండా, ''వేడిగా మెరకపాయ బజ్జీలు తెస్తాను. మా వీధి చిరవ డంబీవాడు బాగా చేస్తాడు'' అని వెళ్లాడు.

అప్పుడు నోరువిప్పింది జానకి.

''ఏవండీ అయోమయంగా వుందా? కొత్తవాళ్లకి అంతేమరి.



మా కంటే అలవాటు అయిపోయింది'' అంది.

''అసలు ఏమిటి ఇదంతా?'' అడిగాను.

''ఏం చెప్పమంటారు. మా ఖర్మ. ఇంట్లో

## కొమ్మూరి సాంబశివరావు స్మారక కథల పోటీలో బహుమతి పొందిన కథ

అందరూ అంతే. పెళ్లిలో జాకని అని నా పేరు చెప్తే జోక్ చేస్తున్నారేమో అనుకున్నాం. మిగిలినవాళ్లు లతంబ్రాలు, నావగల్లి అంటూవుంటే హడావిడికి మాట తడబడుతున్నారనుకున్నాం. తర్వాత తెలిసింది నిజస్వరూపం'' అంది జానకి.

''పోనీ ఏ డాక్టరుకైనా చూపించకపోయారా?''

''ఆ వైభోగమూ అయింది. పాపం ఒక సైక్రియాట్రిస్ట్ వెంకటరామ్‌గారని ఆయన వైద్యం చేశారు.''

''మరి ఫలితం కనిపించలేదా?'' అడిగింది భవాని.

''కనిపించకేం దివ్యంగా కనిపించింది'' చెప్తుండగానే ఫోన్ మోగింది.

కాలర్ ఐ.డిలో నెంబరు చూసి అరుగో సమయానికి దేవుడల్లే ఆయనే ఫోన్ చేశారు. మీరే చూడండి'' అంటూ స్పీకర్ స్విచ్ నొక్కింది.

''లహో'' అని వినిపించింది ఒక కంఠం.

''డాక్టర్ వెంటకరామ్‌ని'' అన్నాడాయన.

''నేనేనండీ జానకిని'' అందీవిడ.

'' ఏమ్మా లాచా రోజుల రతువాత మీతో మాట్లాడుతున్నాను. ఏమిటి శివేషాలు? మీ శ్రీరావూ లిప్పలూ బావున్నారా?'' అని పలకరించి దడదడా మాట్లాడేస్తుంటే వాళ్లావిడ వచ్చినట్లుంది.

''ఎవరూ జానకిగారా? ఏం మహాతల్లీ. ఇంకా మమ్మల్ని వదలవా? లక్షణంగా ప్రాక్టీసు చేసుకుంటూ రెండు చేతులా సంపాదించుకునేవారు. మీకేసు తీసుకుని ఇదుగో ఇలా తయారయ్యాడు. నీకంటే మేము దొరికాం తేరగా. మరి మాకెవరూ దొరకడం లేదే. ఈ ఊళ్లో అందర్నీ బ్రతిమాలి భంగపడి ఢిల్లీ బాంబే కూడా వెళ్లొచ్చాను. ఫలితం శూన్యం. ఇదంతా మీ పుణ్యమే'' అంటూ ఏమిటేమిటో మాట్లాడుతోంది.

''శాదరా తప్పు శాదరా! అని అవతల డాక్టరుగారు భార్యని వారించి ఫోన్‌పెట్టేశాడు.

జాలిగా జానకిగారి వంక చూశాం.

''ఆవిడ తిట్టిందంటే తిట్టదూమరి! మా కారణంగా పాపం ఆవిడ బ్రతుకు అస్థవ్యస్థం అయిపోయింది'' అంది దీనంగా.

''ఏమిటో ఈ విచిత్రం. పిల్లలు ముద్దుగా మాట్లాడితే బాగుంటుంది గానీ పెద్దవాళ్లు అస్థవ్యస్థాన పడితే ఇబ్బందే'' అంది భవాని.

''రండి హాల్లో కూర్చుందాం...'' అంది.

''మాకు జడిసి మా ఇంటికెవరూ ఓ పట్టానరారు. ఏం చెప్పమంటారు నా బాధ'' అంది దీనంగా.


అంతలోనే ఒకతను వచ్చాడు. నలభై దరిదాపుల్లో వుంటుంది అతని వయసు. నలిగిన బట్టలు, రేగిపోయిన తల. అయోమయంగా వున్నాడు చూడ్డానికి.

''గుడీవినింగ్ మేడమ్'' అంటూ విష్ చేశాడు.

జానకి మొహం ఎర్రబడింది. ''నువ్వొకడివి నా ప్రాణానికి చాతకపక్షిలా దాపురించావు'' అంది విసుగ్గా.

''మీరిలా విసుక్కుంటే నేనేమైపోతాను మేడమ్. నా భవిష్యత్తు మీ చేతుల్లో వుంది'' అన్నాడు దీనంగా.

''నా వర్తమానానికి గతి లేదు. నీ భవిష్యత్తు బాగు చేస్తాను నేను'' అంది ఉక్రోషంగా.



''అలా అనకండి మీరు. అన్నివిధాలా అన్యాయం అయిపోయాను. మీరు ఆదుకోకపోతే ఆత్మహత్యే శరణ్యం'' అంటూ కళ్లనీళ్లు పెట్టుకున్నాడు.

ఏమిటండీ ఇది? ఎవరితను? అని అడిగింది భవాని.

జానకినోరు విప్పేలోగానే అతనే కళ్లు తుడుచుకుని ''నేను చెప్తాను మేడమ్'' అంటూ మొదలుపెట్టాడు.

అతని పేరు పవన్‌కుమార్‌ట. ఆ పేరుకి తగినట్లు బలవంతుడూ శక్తిమంతుడూ బుద్ధిమంతుడూ అవుతాడని ఆశపడ్డారుట తల్లిదండ్రులు. అవేమీ కాదుగానీ గాలివాటంగా తయారైందిట అతని బ్రతుకు.

చదువు సరిగ్గా వంటబట్టలేదు. ఎలాగో డిగ్రీపూర్తిచేసి, ఒక స్కూల్లో టీచరుగా చేరాడట. అది కాస్తా గాలివానకి కూలిపోయిందట. ఆ తర్వాత ఒక చిట్‌ఫండ్ కంపెనీలో చేరాడట. అది మూతబడిపోయింది. ఆ తరవాత ఒక పత్రికలో చేరి దగా బ్రతుకులు, బడుగుజీవులూ అని కాలమ్ రాశాడట. ఆ పత్రికా మూతబడి పోయిందిట. ఆ తర్వాత ఒక టి.వి ఛానల్‌లో చేరాడుట. ఉగ్రవాదులకీ తీవ్రవాదులకీ గల వ్యత్యాసం అని ఒక ప్రోగ్రాం చెయ్యాలని నడుం కట్టుకుని వాళ్లని వెతుక్కుంటూ వెళ్లి ప్రశ్నలడగబోయేసరికి వాళ్లు కాళ్లు విరగ్గొట్టి పోయారుట. ఫాక్చరై నాలుగు నెలలు మంచంలో వున్నాడుట.

ప్రస్తుతం ఉద్యోగ ప్రయత్నాల్లో వున్నాడుట. అతని గత వైభవం చూసి ఎవరూ ఉద్యోగం ఇవ్వటం లేదుట.

తిరగ్గా తిరగ్గా ఒకళ్లెవరో ఉద్యోగం ఇస్తానన్నారుట. వాళ్లు శేషా టి.వి అని ఛానెల్ ప్రారంభిస్తున్నారుట.

నువ్వేదైనా వైవిధ్యభరితమైన సంఘటన వెతికి షూట్ చేసి తీసుకొస్తే అది మాకు నచ్చితే ఉద్యోగం ఇస్తాం అన్నారుట.

దేశం మీదపడి గాలిస్తుంటే ఈ కుటుంబం దొరికింది. వీళ్లని ఇంటర్వ్యూ చేసి ఆ కేసేట్ వాళ్లకి చూపిస్తే తప్పకుండా ఉద్యోగం దొరుకుతుందని ఆశ.

ససేమిరా అంటోంది జానకి. అయిన అల్లరి చాలు ఇంకా దేశం అందరికీ తెలియాలా? అంటుం దావిడ.

''ఏ పుట్టలో ఏ పాముందో. మీ గురించి తెలుసుకుని ఎవరైనా మీకు సాయం చెయ్యవచ్చు. లేదా ఇది చూసి ఇలాటి వారెవరన్నా ఇంకెక్కడైనా వుంటే వారి ఆచూకి మీకు తెలియజేస్తే దానివల్ల మీకు కొంత వూరట కలగవచ్చు. ఇవన్నీ ఇలా వుంచి మీ దయ వల్ల నీ జీవితానికి ఒకదారి చూపిస్తే ఆ పుణ్య ఫలాన మీకు కూడా మంచి జరగచ్చు'' అంటాడు పవన్‌కుమార్.

ఇద్దరికీ వాదన జరిగింది. చివరకు 'సరే' అనక తప్పలేదు జానకికి.

కష్టపడి కిందామీదా పడి పెళ్లాం మెడలోని పుస్తే పూసా తాకట్టుపెట్టి కేసెట్ తీశాడు పవన్‌కుమార్. మా భవానే స్క్రిప్టురాసిచ్చింది.

మాకు కేసెట్ వేసి చూపించాడు పవన్‌కుమార్. అతని ఉపోద్ఘాతం అనంతరం భాస్కర్రావుగారిల్లు.

భాస్కర్రావుగారి తండ్రి ఎర్రరంగు పట్టుబట్టలు కట్టుకుని విభూతి రేఖలు దిద్దుకుని సంధ్యావందనం చేస్తున్నారు.

''కేచమ్యా. ఆచవాయస్వాహా.''

★




## రచయిత పరిచయం



**నా** గురించి... తాతయ్య చెప్పే కథలు వింటూ, పద్యాలు నేర్చుకుంటూ బాల్యం గడిచిపోయింది. జీవితంలో ఎక్కువ భాగం ప్రవాసాంధ్రులుగా గడపడం వల్ల తెలుగు భాషపట్ల తగని మక్కువ. హాస్యం అంటే చెవికోసుకోక పోయినా చాలా చాలా ఇష్టం.

1982లో మొదటి రచన అచ్చు అయింది. పాతికదాకా నవలలు, వంద కథలూ రాశాను. నా నవల ప్రేమలేఖ ఆధారంగా శ్రీవారికి ప్రేమలేఖ సినిమా వచ్చింది.

హాస్య కథలకూ బహుమతులకూ ఆమడదూరం. హాస్య కథలకు విడిగా పోటీ పెడితే తప్ప మామూలు పోటీలలో హాస్య రచనలకు బహుమతి రావడం చాలా అరుదు.

ఈ పోటీలో సస్పెన్సు కథలకు, హాస్య కథలకు పెద్దపీట వేశారు.

అందులో బహుమతి గెల్చుకోవడంతో భారతదేశం పాకిస్తాన్ మీద క్రికెట్ మేచ్ గెల్చినంత ఆనందంగా వుంది.

**- పొత్తూరి విజయలక్ష్మి**